
# త్రిశంకు స్వర్గం

యం. నిర్మల



రైలు రావటానికింకా టైముంది. సుమిత్ర ఆలోచనలు గతంలోకి వెళ్ళాయి. తనూ, అరుణ, కరుణ ముగ్గురూ ప్రాణస్నేహితులు. తమలో అరుణ చాలా నెమ్మదైన పిల్ల. తనకి పెద్దగా కోరికలేం లేవు. ఓ అందమైన సంసారం. అందులో తన భర్త, తనూ, పిల్లలూ తన ఆలోచనలు అంత వరకే అంతకు మించి ఆలోచించవలసిన అవసరం కూడా తనకి లేదు. తల్లిదండ్రులు బాగా వున్నవాళ్ళు. ఏదో పెళ్ళి అయ్యే వరకూ చదివించాలి కాబట్టి చదివిస్తున్నారు. ఎప్పుడు మంచి సంబంధం కుదిరితే అప్పుడు పెళ్ళి చెయ్యాలని వాళ్ళ ఉద్దేశం. ఏదో డిగ్రీ పూర్తయిందని పిస్తే అంతేచాలు వాళ్ళ దృష్టిలో. ఇక పోతే తన విషయం. తనకి కూడా పెద్దగా ఆశలు, ఆశయాలు లేకపోయినా, చదివి, ఏదో ఒక ఉద్యోగం సంపాదించుకోవ లసిన అవసరం మాత్రం చాలా వుంది తనకి. ఎందుకంటే తమకి ఆస్తి పాస్తులేం లేవు. తండ్రి ఉద్యోగమే ఆధారం. ఎంతగవర్నమెంటు ఉద్యోగానికైనా, నలుగురు పిల్లల్ని పెంచి పెద్ద చెయ్యాలంటే తన వాళ్ళకి సమస్యే. అందుకే ఇంటికి పెద్ద కూతురిగా పుట్టిన తను తప్పనిసరిగా ఏదో ఉద్యోగం సంపాదించుకుని తన కాళ్ళ మీదతను నిలబడాలని తన అభిప్రాయం. ఆశ కూడా. అయితే తమ ఇద్దరికీ పూర్తిగా భిన్నమైన వ్యక్తి కరుణ. ఆమెలో ఆవేశం, ఉద్రేకం కాస్త

ఎక్కువ పాళ్ళలోనే వుండేవి. తను ముగ్గురినీ కలిపి కాలేజీలో అంతా 'టీవ్ దేవియా' అనీ, 'ముగ్గురమ్మాయిలని ఏడిపిస్తుండే వాళ్ళు కూడా.

ఓ రోజు స్నేహితురాళ్ళ మధ్య చర్చ ప్రారంభమైంది. తన సహాధ్యాయిని ఒకమ్మాయి చదువు మధ్యలో ఆపేసి పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయింది. ఆ అమ్మాయి చదువు పూర్తి చేసుకున్న తరువాత పెళ్ళి చేసుకుంటే బాగుండేదని తనకి ఎంతగానో అనిపించింది. అందుకే వుండబట్టలేక నలుగురూ కూర్చుని వుండగా పైకే అనేసింది తను.

"ఒక్క సంవత్సరం చదువూ పూర్తిచేసి వుంటే ఎంత బాగుండేది పాపం. అలా అర్థంతరంగా మానేసింది, ఎలా ప్రాణం ఒప్పిందో"

"పైగా కట్నమిచ్చి మరీ చేసుకుంది. అసలు చదువుకున్న దన్నమాటేగానీ బొత్తిగా వెన్నెముక లేని మనిషి. ఆ మాత్రం ధైర్యం లేకపోతే ఎలా! కట్నం తీసుకునే వాడిని చేసుకోనని తెగేసి ఎందుకు చెప్పలేక పోయింది?" వాదన మొదలు పెట్టింది కరుణ.

"అసలు నీ బాధేమిటో! అది పెళ్ళి చేసుకుని వెళ్ళి పోయిందనా? లేకపోతే కట్నమిచ్చి చేసుకుందనా? వాళ్ళ నాన్న కట్నం ఇచ్చారు. ఆ అమ్మాయి పెళ్ళి చేసుకుంది. మధ్యలో నీ గోలేమిటి? ఊరికే గొంతు చించుకుంటున్నావు. ఆ పిల్ల చేసిన తప్పేమిటి? హాయిగా పెళ్ళి చేసుకుని సుఖ పడుతోంది. అరిచింది చాల్లేగానీ ఆ గోల ఆపి పడుకో. నాకు నిద్దరొస్తోంది" ఆవలించింది అరుణ.

"ఛీ! నీకు మీ వాళ్ళు అరుణ అనిపేరెందుకు పెట్టారే బాబూ! హాయిగాఅప్పలమ్మనో నాంచారమ్మనో పెట్టి వుంటే బాగుండేది. ఇంచక్కా పేరుకు తగ్గట్టు పెళ్ళి చేసుకుని ఓ పక్కన పడి వుండేదానివి. చక్కగా సరిపోయేది. ఇప్పుడు మాత్రం ఏం పోయింది? రేపు నువ్వూ చేసుకో! కానీ నేనైతేనా! మా వాళ్ళు ఇవ్వబోయే కట్నం చూసి గానీ, నాకు రాబోయే ఆస్తి చూసిగానీ వచ్చేవాడిని చస్తే చేసుకోను. నాకంటూ ఓ వ్యక్తిత్వం వుందని నిరూపిస్తాను. నన్ను ప్రేమించి నన్ను నన్నుగా కోరుకునే వాడిని మాత్రమే చేసుకుంటాను. అసలు కట్నం తీసుకునే మగవాడినీ... ..." ఆవేశం ఎక్కువై ఆయాసపడింది కరుణ.

తను ప్రేక్షకురాలిలా చూస్తుండి పోయింది.

ఆ తరువాత డిగ్రీలు చేతికి రావడం, అరుణ పెళ్ళి చేసుకుని బొంబాయి వెళ్ళి పోవడం జరిగింది. కరుణమాత్రం తను అనుకున్నట్టుగానే ఇంట్లో వాళ్ళు కుదిర్చిన సంబంధం కాదని, తను ఇష్టపడిన శేఖర్‌ను పెళ్ళి చేసుకుంది. మరోసారి ఆలోచించమని తను కూడా నచ్చ చెప్పింది. అయినా తన మొండి పట్టుదల వదలకుండా అతనినే పెళ్ళి చేసుకుంది. వాళ్ళమ్మా వాళ్ళకి కోపం వచ్చి ఆ పెళ్ళికి రాలేదు. స్నేహితులు తప్ప బంధువులెవరూ లేకుండానే పెళ్ళి నిర్విఘ్నంగా జరిగిపోయింది. శేఖర్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో మేనేజర్‌గా చేరాడు. అదో పేరున్న కంపెనీ కావడంతో జీతం బాగానేవచ్చేది. అదీకాక కంపెనీ క్వార్టరు కూడా ఇచ్చింది. తను హాయిగా వుంటున్నట్టుగా అప్పుడప్పుడు తను రాసే ఉత్తరాల వల్ల తెలుస్తుండేది. ఓ కొడుకు కూడా పుట్టాడనీ, వాడికి కిరణ్ అని పేరు పెట్టాననీ కూడా వ్రాసింది. తనూతన ఉద్యోగంలో పడి ఉత్తరాలు వ్రాయడం కొంత తగ్గించింది. ఆ తరువాత తన పెళ్ళికి వచ్చి వెంటనే వెళ్ళిపోయింది. క్రమేపీ ఉత్తరాల సంఖ్య తగ్గింది. గత నాలుగేళ్ళుగా అసలు ఉత్తరాలు లేవు. అలాంటిది ఇన్నేళ్ళకి గాను నాలుగు రోజుల కిందట కరుణ దగ్గర నుండి వచ్చిన ఉత్తరం తనని ఆశ్చర్య పరిచింది.

"మిత్రా! నేను రేపు ఆదివారం ఉదయం ఈస్ట్‌కోస్ట్‌లో బయలుదేరి వస్తున్నాను. స్టేషన్‌కి వస్తావని తలుస్తాను. మిగతా విషయాలు సమక్షంలో. మర్చిపోవు కదూ"

నీ బుజ్జి

* * * * *

ప్లాట్ ఫారం మీద బండి ఆగగానే కరుణని వెతుకుతూ గబగబా ముందుకు అడుగేసింది సుమిత్ర. "సుమిత్రా" అంటూ కౌగలించుకున్నంత పని చేసింది కరుణ.

"ఏమిటే హడావిడి. పద పద. ఒరే కిరణ్. ఇలా రామ్మా: బాగున్నావా కరుణా! అలా చిక్కిపోయావేమిటి?" ప్రశ్నల వెంట ప్రశ్నలు కురిపించింది సుమిత్ర.

మాట్లాడుతూనే ఇంటికి చేరారు. అయితే తన రాకకి కారణం మాత్రం అడగలేదు సుమిత్ర. భోజనం చేసేదాకా ఊరుకుని అప్పుడు మెల్లగా మొదలు పెట్టింది.

"బుజ్జీ ఇన్నాళ్ళూ ఉత్తరాలు పత్తరాలు లేకుండా ఇవాళ ఇంత హఠాత్తుగా ఊడిపడ్డావేమిటి? అలా అడిగానని ఏమీ అనుకోకు. నిన్ను చూస్తుంటే ఏదో తేడాగా అనిపిస్తోంది. అవునూ! ఇంతకూ శేఖర్ ఎలా వున్నాడు? తను రాలేదేమిటి?"

సుమిత్ర ప్రశ్నలకి సమాధానంగా ఆమెని వాటేసుకుని భోరుమంది కరుణ. నెమ్మదిగా అసలు విషయం రాబట్టిన సుమిత్ర ఎంతో ఆశ్చర్యపోయింది.


మొదట్లో ప్రేమ మహత్యంవల్ల ప్రపంచం రంగుల హరివిల్లులా అనిపించింది ఇద్దరికీ. కానీ ఆ తరువాతే ప్రారంభమైంది అసలు కథ. తన చుట్టూ ఎదిగిపోతున్న ప్రపంచం ముందు తను ఎంతో దిగువన వున్నట్టుగా అనిపించడం ప్రారంభం అయింది శేఖర్‌కి. పెరిగిపోతున్న సౌకర్యాలు, తన చుట్టూ ఆస్తిపాస్తులు సంపాదించుకుని పైపైకి పోతున్న మనుషులనీ చూస్తూ తనతో వారిని పోల్చుకుని అసంతృప్తి పడేవాడు. వారిలాగా డబ్బు సంపాదించడానికి తనకున్న ఉద్యోగంలో ఎక్కువ అవకాశాలు లేకపోవడంతో తన ప్రతాపాన్ని కరుణ మీద చూపించేవాడు. తనకి రావలసిన ఆస్తిని అడిగి తీసుకురమ్మని వేధించేవాడు. క్రమేపీ దురలవాట్లకు లోనై, చెడు సావాసాలు పట్టి పూర్తిగా మారిపోయాడు. అతనిని మార్చటానికి కరుణచేసిన ప్రయత్నాలన్నీ విఫలమై పోయాయి. అతను ఎందరో స్నేహితు(రాళ్ళ)ను తీసుకు వచ్చి ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నా సహించింది.


కానీ, పుట్టింటికి తిరిగి వెళ్ళి వాళ్ళ సహాయం కోరటానికి కరుణ అభిమానం అడ్డం వచ్చింది. అతని దుర్మార్గానికి అంతం లేకుండా పోయింది. చివరికి తన శీలాన్ని కూడా అతని ఆశల కోసం బలి చెయ్యబోతుంటే భరించలేక పారి పోయి వచ్చింది.

"కరుణా! పోనీలేవే!ఎలాగో ఆ నరకంలో నుండి బయట పడ్డావు కదా! ఛీ!ఛీ!నీలాటి ధైర్యస్థులే ఇలా బెంబేలు పడితే మామూలు వాళ్ళు ఎలా బతుకుతారే! ధైర్యంగా వుండు.మేమంతా లేమా! ప్రస్తుతం నువ్వేమీ ఆలోచించక విశ్రాంతి తీసుకో. మిగతా విషయాలు నిదానంగా ఆలోచిద్దాం." కరుణనివంటరిగా వదిలేసి తన గదిలోకి వెళ్లింది సుమిత్ర.

"ఎంతసేపూ నీ స్నేహితురాలితో కబుర్లేనా? నాసంగతి పట్టించుకొనేదేమైనా ఉందా లేదా?" హాస్యాలాడబోయాడు మురళీనాథ్ ఆ రాత్రి.

విచారంగా వున్న సుమిత్ర ముఖం చూసి అలాగే ఆగిపోయాడు మళ్ళా మాట్లాడకుండా. చివరికి సుమిత్రే జరిగిందంతా చెప్పేసింది.



# ముంపు

ఈ మోటబావి ఈ పొలం
మా బాపు చెమటకి గుర్తు
ఈ వాగు మా బతకమ్మలకి గుర్తు
ఈ ఇల్లు మా సమిష్టి కుటుంబానికి గుర్తు
ఈ నులకమంచం మా లూటీకి గుర్తు
ఈ చావిడి మా వూరి ఐకమత్యానికి గుర్తు
ఈ చెట్టు మా ఆటలకి గుర్తు
వీటన్నింటిని పెనవేసుకున్న మా వూరు
నా బాల్యానికి గుర్తు
వీటిని వేరు చేయడం
ఆకాశాన్ని భూమిని వేరు చేయడం లాంటిదే
ఈ జ్ఞాపకాల్ని వదిలి ఎక్కడికి వెళ్ళాలి
అవును నిజం
మా ఇంటికి పొలాలకి
మా బాపులకి ఖరీదు కడ్తావు
మాకు లాభం వస్తుందంటావు
కానీ
మా జ్ఞాపకాలని ధరకట్టగలవా?
ఎన్ని దగాల మధ్య
ఎంత దోపిడీ మధ్య నా వూరిని పోగొట్టుకోవాలి
ఎన్ని రోజులు



ఎన్ని సంవత్సరాలు
ఎంత కాలం
మీ చుట్టూ
గానుగెద్దులా తిరగాలి
అయినా
నా వూరిని నేను కొనుక్కోగలనా?
నా జ్ఞాపకాలని నేను తెచ్చుకోగలనా?
నా నులకమంచం, నా 'లూటీర'
నా వసారా, నా కచేరీ
నా బాల్యంతో చాపలా అల్లుకుపోయిన
మా వూరు నాకు తిరిగి రాగలవా?
నాకు తెలుసు
ఈ ముంపులో మునిగేది
నేనూ
నా వూరూ
నా జ్ఞాపకాలు
ఈ ముంపులో తేలేది
మీరూ
మీ అధికారం
మీ నల్లకోట్లు
మీ బంగ్లాలు – మీ భవంతులు

— జింబో

ఒక్క నిముషం ఆలోచనలో పడ్డాడతను.

పది నిముషాలు అలాగే గడిచాయి నిశ్శబ్దంగా.

''సుమీ!''కళ్ళెత్తి అతని వంక చూసింది. "మరేం ఫర్వాలేదు. ఆవిడ చదువుకున్నదే కదా! తన బ్రతుకు తను బ్రతకగలదు. ఏదో ఓ ఉద్యోగం చూస్తే తనకీ కాలక్షేపంగా ఉంటుంది. తన కాళ్ళ మీద తను నిలబడుతుంది. ఆ ప్రయత్నం నేను చేస్తాను కదా! నువ్వేం బాధపడకు. మొత్తానికి ఆవిడ ధైర్యం చేసి మంచి పనే చేసింది. ఏ చెయ్యాలన్నది రేపు ఆలోచిద్దాము. ప్రస్తుతానికి నువ్వు కూడా విశ్రాంతి తీసుకో." భార్య వీపు మీద చెయ్యి వేసి ధైర్యం చెప్పాడు మురళి.

అలా వచ్చిన కరుణ మురళి స్నేహితుడు పెట్టిన స్కూల్లో టీచరుగా చేరి గుంటూరు వెళ్ళిపోవడం జరిగింది. వారం వారం మాత్రం తప్పకుండా వచ్చి సుమిత్ర వాళ్ళతో గడిపి వెడుతుండడం కూడా జరిగిపోతోంది. కాస్త మనసు కుదుట పరచుకుని మామూలు జీవితానికి అలవాటు పడింది కరుణ.

x x x

కాల ప్రవాహంలో ఆరు కాలెండర్లు మారాయి. కరుణ, శేఖర్ చట్టరీత్యా విడిపోయి కూడా నాలుగేళ్ళయిపోయింది. ఇప్పుడు కిరణ్‌కి పదేళ్ళు. ఐదో తరగతి చదువుతున్నాడు. సుమిత్ర పిల్లలు కూడా స్కూల్లో చేరారు.

చాలా రోజుల తర్వాత కరుణ, సుమిత్ర వంటింట్లో చేరి కబుర్లు చెప్పుకుంటున్నారు.

"మిత్రా! నేను పొరపాటు చేశానంటావా?" హఠాత్తుగా అడిగింది కరుణ.

ప్రశ్నార్థకంగా చూసింది సుమిత్ర.

"అదేనే! ఈ ఒంటరి తనం ఎంత బాధాకరమైందో ఇప్పుడు తెలుస్తోంది. అసలు నేను తొందరపడి ఇలా రాకుండా, కష్టమో నిష్ఠూరమో అక్కడే వుండి ఉంటే ఎలా ఉండేదో అనిపిస్తోందీ. అసలు ఇలా వచ్చేసి తప్పు చేశానేమో"

ఆశ్చర్యపోయింది. సుమిత్ర. "కరుణా! నువ్వేనా ఇలా మాట్లాడేది. నీ ధైర్యమంతా ఏమైపోయింది. ఆ నరకమే దీని కంటే బాగుండేదంటావా! ఈ ఒంటరితనం కంటే ఆ ఆత్మహత్య మేలంటావా! ఏమిటే నువ్వు మాట్లాడేది? ఇలాటి పిచ్చి పిచ్చి ఆలోచనలు రానీయక! చేతినిండా వ్యాపకం పెట్టుకుంటే నీకిలాటి ఆలోచనలు రావు"

"హా! పుస్తకాలలో చెప్పేవి ఒట్టి ఆదర్శాలు మాత్రమే. నాకేం తక్కువని నా బ్రతుకిలాగయింది. నా తోటి వాళ్లందరూ చక్కగా సంసారాలు చేసుకుంటుంటే నేనెందుకిలా కుళ్ళి చావాలి. నాకేం తక్కువని నాలో ఏం లోపమని అతనలా ప్రవర్తించాలి. అందం తక్కువా! చదువు తక్కువా! నాచుట్టుపక్కల అందరూహాయిగా వుంటే నేనెందుకు ఒంటరిగా ఇలా త్యాగాలు చేసుకుంటూ పోవాలి!"

"కరుణా! ఎందుకు నిన్ను నువ్వు చిన్నబుచ్చుకుంటావు. నీ కేం తక్కువ. మనసు లేని మనిషితో కాపురం కంటే నువ్వు బతికే స్వేచ్ఛా పూర్వకమైన బతుకు గొప్పగా లేదూ! అతని పంచలో అవమానాలు సహిస్తూ పడివుండ లేదని అలా హీనంగా ఎందుకే ఆలోచిస్తున్నావు. ఇంత చదువు చదివి, ఇంత తెలిసీ, అదీ ఇన్నేళ్ళ తర్వాత ఇలా ఎందుకు మాట్లాడుతున్నావో నా కర్థం కావటం లేదు."

"అవునులే! నీకెలా అర్థం అవుతుంది. కడుపునిండా భోజనం చేసిన వాడికి ఆకలి గురించి ఏ తెలుస్తుంది. ఏదైనా అనుభవించినవాడికే తెలుస్తుంది. నా పరిస్థితిలో నువ్వుంటే నీకు తెలిసేది. నీ కన్నీ ఉన్నాయి కాబట్టి ఏ లోటూ తెలియడం లేదు. ఎంత చెప్పినా నీ కర్థం కాదులే" నిట్టూర్చింది కరుణ.

ఇలాగే రెండు మూడుసార్లు సుమిత్ర దగ్గిర తన బాధ వెళ్ళబోసుకుంది కరుణ.

"బుజ్జీ! నీ మనసులోని బాధ మాకు తెలుసు. కానీ చెయ్యి గలిగిందేముంది చెప్పు, ఉన్న బాధని తలచుకుంటే మరింత బాధ కలుగుతుంది. అందుకే సాధ్యమైనంత వరకు మర్చిపోవడానికి ప్రయత్నించు. ఏదైనా కాలక్షేపం వెతుక్కో. పుస్తకాలుచదువు. వదిలేసిన నీ రచనా వ్యాసంగం మళ్ళీ మొదలుపెట్టు. నువ్విలా అధైర్యపడితే మేము భరించలేము"

"ఏ పుస్తకాలు చదవమన్నావో చెప్పు! కాలక్షేపానికి ఏ పుస్తకం తీసినా నాబాధను గుర్తు చేసేవే గాని తగ్గించేవి కావు. నాకేమనిపిస్తోందో తెలుసా! నేను మళ్ళీ పెళ్ళెందుకు చేసుకోకూడదు."

కొంచెం ఆశ్చర్యంగా చూసింది సుమిత్ర.

"కరుణా! ఇప్పుడు...ఇప్పుడు"అర్థోక్తిలో ఆపేసింది సుమిత్ర.

"ఏం? ఎందుకు చేసుకోకూడదు. నా కేం తక్కువ. పెళ్ళికి కావలసిన అర్హతలన్నీ ఉన్నాయి. అందం, చదువు, వయస్సు అన్నీ ఉన్నాయి. నా వయసెంతో చెప్పు, ముప్పై మూడు. ఈ వయసుకే నేను ముసలిదాన్నైపోయానా. నా వయసు ఆడపిల్లల్లో ఈ రోజుల్లో పెళ్ళికాని వాళ్ళెంత మందో. అయినా నా పరిస్థితిలో మగవాడే వుంటే ఇలా వుండే వాడంటావా? ఈ పాటికి ఎప్పుడో మళ్ళీ పెళ్ళి చేసుకుని హాయిగా సుఖపడేవాడు. అప్పుడు ఎవరికీ ఆశ్చర్యంగా ఉండదు. సర్వసాధారణంగా వుండేది. మరి నేను చేసుకుంటానంటేనే ఆశ్చర్యం. ఏం? ఆడదానికి జీవితం అక్కరలేదా! ఇలా త్యాగాలు చేస్తూపోవలసిందేనా? ఏమిటీ న్యాయం? ఎందుకీ తేడాలు? చివరికి నువ్వు కూడా నేనిలా అంటానని ఊహించలేకపోయావు. అది మన ఆడవాళ్ళ దౌర్భాగ్యం."

"అది కాదు కరుణా!నువ్వు పెళ్ళి చేసుకుని, జీవితంలో మళ్ళీ తోడు పొందుతానంటే మా కంటే సంతోషించే వాళ్ళు ఎవరూ వుండరే? కానీ, అలాటివ్యక్తి దొరకాలి కదా!

"నిన్ను పెళ్ళిచేసుకోవటానికి ముందుకు వచ్చేవాళ్ళెంత మంది? ఒకవేళ ఎవరైనా వచ్చినా నువ్వు అతనితో సర్దుకుపోగలవా? రేపటిరోజున నీగతం గురించి ఒకమాట మాట్లాడితే సహించగలవా? ఇవన్నీ అలాఉంచు. ఆడది తన భర్తకి పుట్టిన పిల్లలను తన పిల్లలుగా స్వీకరించగలదు. ఆదరించగలదు. ప్రేమించగలదు. కానీ, తనకి పుట్టిన బిడ్డనే లాలించటం చేతకాని మగవాళ్ళున్నారు ఈ ప్రపంచంలో. అటువంటిది ఎవరికో పుట్టిన బిడ్డను స్వంత బిడ్డగా ఆదరించగలడా నిన్ను చేసుకునేవాడు. అలా నిరాదరణకు నీ బిడ్డ గురైతే నువ్వు భరించగలవా! తల్లివి నువ్వుండికూడా వాడు అనాథలాగా పెరుగుతుంటే తట్టుకోగలవా? తొందరపాటుతో ఒకడుగు పొరపాటుగా వేశావు. అది సరిదిద్దుకుని ఒడ్డున పడ్డావు. మళ్ళీ ఇంకొక ఊబిలో దిగాలనుకుంటున్నావా? ఆలోచించుమరి." నచ్చచెప్పబోయింది సుమిత్ర.

"అదే! అదే! మనుషుల్లో ఈ మార్పు రాదేమనే నా బాధ. అందుకే నాకీ ఆక్రోశం. అయినా పిల్లలు, మాతృప్రేమ అంటూ కబుర్లు చెపుతున్నావే. అన్నీ సవ్యంగా వుంటేనే ఏదైనా!

నా సుఖాలన్నీ చంపుకొని వీడిని పెంచి పెద్దచేస్తే రేపు వీడికి ఆ కృతజ్ఞత ఉంటుందనుకుంటున్నావా? వాడు చచ్చినా నన్ను తలుచుకోనుకూడ తలుచుకోడు. వాడు, వాడి భార్య, పిల్లలు, వాడి జీవితం. మా అమ్మ ఇంత కష్టపడి పెంచిందని కూడా అనుకోడే. కానీ ఆ తృప్తికూడ మిగలదునాకు. ఇప్పుడు ఎంతమందిని చూడటం లేదు మనం. అన్నీ సవ్యంగా ఉన్న తల్లిదండ్రులనే పట్టించుకోవటంలేదు ఈ కాలం పిల్లలు. అలాటిది వాడు నన్నెందుకుచూస్తాడు."

"ఒక్కమాటడుగుతాను ఏమీ అనుకోవుకదూ కరుణా? నువ్వన్నవన్నీ రైటనీ నేను ఒప్పుకుంటాను. కానీ వాడు ఇంకా చిన్నవాడు. జీవితమంటే తెలియనివాడి గురించి నువ్వెన్నెన్నో ఊహిస్తున్నావు. కానీ ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకో. నీ తల్లిదండ్రులు నిన్నెంత గారాబంగా పెంచారో. నువ్వడిగిందానికి కాదనలేదు. కోరినవన్నీ తెచ్చిచ్చారు. వాళ్ళకి నువ్వేం చేశావు. అది గుర్తుతెచ్చుకో. వాళ్ళమాట కాదని నా జీవితం, నాయిష్టం అంటూ ముందుకు అడుగేశావా లేదా! అది తప్పటడుగు కావటం నీ దురదృష్టం. అయినా వాళ్ళు నిన్ను ద్వేషించలేదు. నీ గురించి వాళ్ళెంత బాధపడుతున్నారో నీకు తెలియదు. నీకింకా వాళ్ళమీద దురభిప్రాయమే. నువ్వు మాత్రం నీ కొడుకు రేపు నిన్ను చూడడని నిందలేస్తున్నావు. నువ్వు చెయ్యని పనిని వాడినుండి నువ్వెలా ఆశిస్తున్నావు. కన్నావు కాబట్టి పెంచి పెద్దచెయ్యటం నీ విధి. అంతవరకే. ప్రతిఫలం ఆశించటం తెలివితక్కువ. వాడేకాదు. రేపు నా పిల్లలైనా అంతే. పెంచటం, చదివించటం, వాళ్ళకొక భవిష్యత్తు ఏర్పరచటం మనవిధి."

"నీ పిల్లలు నిన్ను నిర్లక్ష్యం చేసినా నీకు నీ భర్త ఉన్నాడు కాబట్టి నీకు బాధలేదు. కానీ నా విషయం అలాకాదు. ఆ బాధ తట్టుకోవటం ఎంతకష్టమో నీకు తెలియదు."

"ఓసి పిచ్చిదానా? ఎవరికెవరు అనేది ఎవరూ చెప్పలేము. ఎవరిమీదా ఆశలు పెంచుకోకూడదని అన్నానేకానీ, వాడు రేపు నిన్ను చూడడని అనలేదునేను. నీ జీవితంలో తోడు గురించి మాట్లాడుతున్నావుకానీ, మరోతోడు తెచ్చుకోవటంలో ఉన్న సమస్యలు నువ్వు ఆలోచించటంలేదు. మొదటిపెళ్ళికి కొన్నే సమస్యలు. కానీ నీకు రెండింతలు సమస్యలు. తీరా పెళ్ళి చేసుకున్న తర్వాత మళ్ళీ సుఖంగా ఉన్న జీవితాన్ని కష్టాలపాలు చేసుకున్నానని నువ్వు బాధపడకుండా ఉండగలగాలి. ఎవరైనా భార్యావిహీనుడైన వ్యక్తిని చేసుకున్నాననుకో. అతనికి పిల్లలుంటే వాళ్ళని కిరణ్‌తో సమానంగా చూడగలగాలి. ఆదర్శాలు పుస్తకాలకీ, సినిమాలకీ పరిమితమైనాయి. నిజజీవితంలో ఆచరించాలంటే చాలా ధైర్యం కావాలి. అభ్యుదయ భావాలని మనం మెచ్చుకోగలంగాని జీవితంలో అంతత్వరగా జీర్ణించుకోలేం. ఒకరిద్దరి దృక్పథాల్లో మార్పువస్తే చాలదు. మొత్తం సంఘంలోనే మార్పురావాలి. ఇటువంటి సంఘటనలు చాలా తేలికగా తీసుకునే రోజులు రావాలి. అప్పటిదాకా ఈ సమస్య ఇలాగే వుంటుంది. నీ తరంలో నువ్వు నీకు జరిగిన అన్యాయం గురించి ప్రశ్నించగలుగుతున్నావు. నీ సమస్యకి పరిష్కారం వెతుక్కోగలుగుతున్నావు. కానీ నీ ముందరి తరం ఆడవాళ్ళ గురించి ఆలోచించు. వాళ్ళు మనసులో మథనపడ్డారేగానీ, పరిస్థితులని ఎదిరించే స్వేచ్ఛ, ధైర్యం వాళ్ళకి లేవు. అలా జీవచ్ఛవాల్లాగా అనుక్షణం ఆత్మహత్య చేసుకుంటూ బతికారు. కానీ నీ పరిస్థితి కొంచెం మెరుగ్గా లేదూ! ఇన్ని కబుర్లు చెప్పావుకానీ రేపు నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకుంటే ఎవరైనా నీ గురించి చెడుగాఅంటే తట్టుకునే ధైర్యం వుందా? వాళ్ళని లెక్కచెయ్యనంత ఎత్తుకు నువ్వు ఎదగాలి. అప్పుడే నువ్వు సుఖపడతావు. కానీ నీకలాకాదు. నీ చర్యని అందరూ హర్షించాలి. వాళ్ళు ఏమన్నా అంటే మళ్ళీ నీ బాధ మొదలు. ఆ మనస్థైర్యం, గుండెనిబ్బరం నీకు లేనపుడు గుండె దిటవుచేసుకుని ఒంటరిజీవితం సాగించు. ఈ మహాయజ్ఞంలో నీలాటివాళ్ళు కొందరు త్యాగం చెయ్యక తప్పదు. ఏఒక్కరితోడు లేకపోయినా రెండోవాళ్ళ బతుకు పరిపూర్ణం కాదు. ఆ అభిప్రాయం అందరిలోనూ రావాలి.

"ముందుకి ధైర్యంగా సాగలేక,వెనకబడి ఉండలేక త్రిశంకుస్వర్గంలో వుండే మనలాటివాళ్ళ బతుకులింతే. నువ్వు కోరిన మార్పు వచ్చేసరికి చాలాకాలం పడుతుంది. లేదూ ఈ సంఘానికందనంత ఎత్తుకి ఎదిగిపోతానంటావా? మళ్ళీ కిందకి జారిపడకూడదు. ఒకడుగు ముందుకు వేసిన తర్వాత జారిపడే ఆలోచనే రాకూడదు. నీళ్ళలోకి దిగేముందు లోతు గురించి ఆలోచించుకొని దిగాలి. దిగింతర్వాత లోతు గురించి ఆలోచించటం తెలివితక్కువ. సగం దూరం వెళ్ళి మళ్ళీ వెనక్కితిరిగి రాకూడదు. దానంత మూర్ఖత్వం ఇంకోటిలేదు. ఎలాగోలా ఎదురీది అవతలిఒడ్డుకు చేరాలి. స్వర్గంకోసం ప్రయత్నంచేసేటపుడు త్రిశంకుస్వర్గాన్ని అధిగమించగలగాలి. ఆలోచించు. నిర్ణయం నీది. నేనిలా అన్నానని కోపం తెచ్చుకోకు" కరుణ భుజం తట్టి అక్కడినుండి వెళ్ళిపోయింది సుమిత్ర.

ఆలోచిస్తూ అలా నిలబడిపోయింది కరుణ.

◆

## శవాలు లేచి...

ఇక్కడ
చితిమంటల్లోంచి
శవాలు లేచి సమావేశమౌతాయి
మత సామరస్యం, లౌకికత్వం
కాపాడ్డానికై శపథం చేస్తాయి
ఇక్కడ
మనుషులంతా గుమిగూడి
మహాసభలు పెట్టుకుంటారు
మతం పేరిట, కులం పేరిట
మారణహోమం సృష్టించి
మత సామరస్యాన్ని, లౌకికత్వాన్ని
సమాధి చేయాలని నిలువునా తగలెయ్యాలని
తీర్మానం చేస్తారు
ఆ తర్వాత వీళ్ళే మళ్ళీ...
చితిమంటల్లోంచి సమాధుల్లోంచి
శవాలుగా లేచి సమావేశమౌతారు!

— సాబిర్